క్లుప్తంగా

మండలమీట్ వాయిదా

చిల్లకూరు: పలు అంశాలపై చర్చించాల్సి ఉన్నప్పటికీ అధికారులు హాజరుకాకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల మీట్‌కు మండల, డివిజన్‌స్థాయి అధికారులు ఎవరూ హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ తిరుపతిలో సమావేశం నిర్వహిస్తుండడంతో అన్ని శాఖల అధికారులు అక్కడికి వెళ్లిన కారణంగా సమావేశాన్ని నిర్వహించలేకపోతున్నామన్నారు. ఈనెల 28వ తేదీన మండల మీట్‌ను నిర్వహిస్తామని ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటకు పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్య కల్యాణ మండపంలో కొలువు దీర్చి, శోభాయమానంగా అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ జరిపారు.

ఘనంగా తాళ్లమ్మ కొలుపు



దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మతల్లి కొలుపు శుక్రవారం నుంచి ప్రారంభమైంది. గ్రామంలో తాళ్లమ్మ ఆలయం నూతనంగా నిర్మించారు. ఇందులో భాగంగా 41 రోజులు పాటు కుంభాభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పోతురాజు, పరుశురామయ్య, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. యువత కేరింతల నడుమ గొల్లలు మేళ తాళాలు నడుమ వీరతాళ్లు వేశారు. శనివారం రాత్రి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు

ఓజిలి: భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 49 రెవెన్యూ గ్రామాల్లో 27 గ్రామాల్లో జగనన్న భూసర్వే పూర్తి చేశామన్నారు. 22 గ్రామాల్లో సర్వే ప్రారంభం కాలేదన్నారు. వీర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి 24వ తేదీ నుంచి గ్రామాల వారీగా సభలు నిర్వహిస్తామన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

గూడూరురూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన గూడూరులో జరగనున్న మాదిగల రాజకీయ చైతన్య ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం గూడూరు మండలంలోని మేకనూరు, అయ్యవారిపాళెం, కాంద్ర, కొండాగుంట గ్రామాల్లో ప్రచారం చేసి, కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కే పోలు మాదిగ, ప్రధాన కార్యదర్శి వీ రవికుమార్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు కే శ్రీనివాసులు మాదిగ పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

గూడూరురూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ గూడూరు డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్‌కేపీ. జిలాని మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏపీఎస్, ఇంక్రిమెంట్‌లను సకాలంలో కలపాలని కోరారు. గూడూరు డిపో అధ్యక్షుడు వైవీ నారాయణ, జిల్లా నాయకురాలు పద్మజ పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

తడ: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూళ్లూరుపేట స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 24వ తేదీ బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబీ సీఐ ఈ సూర్యనారాయణ శనివారం తెలిపారు. పల్సర్ బైక్‌తో పాటు టీవీఎస్ ఎక్సెల్ వాహనాలను వేలం వేయనున్నట్టు తెలిపారు.

జగనన్న సురక్ష పేదలకు వరం



ఓజిలి: ఆర్మేనిపాడులో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



గూడూరురూరల్: సర్టిఫికెట్ అందజేస్తున్న సీఈసీ సభ్యులు ఎల్లసిరి

ఓజిలి: వివిధ సాంకేతిక కారణాలతో అర్హత ఉన్నా పథకాలు అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం వరమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని ఆర్మేనిపాడు సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. అలాగే ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో గున్నం సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు, నాయకులు వెంకటసుబ్బరాజు, సుకుమార్‌రాజు, సర్పంచ్ పోలయ్య, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీఓ రజనీకాంత్, ఇరిగేషన్ డీఈ కోటేశ్వర్‌రావు, ఏపీఎం నిర్మలమ్మ, ఏపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

గూడూరురూరల్: క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని జాంద్రవీధి, మాళవ్యానగర్–2, చెన్నూరు సచివాలయం–2లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ టీ శ్రీనివాసులు, జే సుకన్య, జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, సచివాలయ కన్వీనర్ డి.వినీష్ యాదవ్, సుభాన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విందూరులో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం మస్తానయ్య పాల్గొన్నారు.

వలంటీర్లు నమ్మకంగా పని చేయాలి

పెళ్లకూరు: వలంటీర్లు ప్రతి ఒక్కరూ నమ్మకంగా పని చేయాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం నెలబల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, సర్పంచ్ కమలమ్మ, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏఓ ప్రవీణ, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, సురేష్‌రెడ్డి, గోపాలయ్య, రోశయ్య పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

నాయుడుపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక సూచించారు. మండలంలోని విన్నమాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వీ లక్ష్మీనారాయణరెడ్డి, కే రాజారెడ్డి, కే మాధవరెడ్డి, కే జయరామయ్య, డీ రవి మున్సిపల్ వైస్ చైర్మన్ జె వెంకటకృష్ణారెడ్డి, ఆర్ సరిత, శేఖర్, పీ రాహుల్, ఎంపీటీసీ సభ్యులు బీ హరిరెడ్డి, సర్పంచ్ సోమశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని జేసీఎస్ మండల కన్వీనర్ ఎం రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎన్ రాంగోపాల్‌రెడ్డి, సర్పంచ్ శారద, ఉప సర్పంచ్, శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

11 రకాల సేవలు

కలువాయి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు ఉచితంగా అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. కుల్లూరు సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.స్వర్ణ, ఎంపీడీఓ నారాయణ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి మేలు

రాపూరు: ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు నేత పీ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెంచల్ రెడ్డి అన్నారు. రాపూరు మండలం తెగచర్ల సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

పూలతోటలో జగనన్న సురక్ష

దొరవారిసత్రం: పూలతోట సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 765 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేసినట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈ శ్రీనివాసుల రెడ్డి, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, నాయకులు బాబు నాయుడు, రాజగోపాల్, మహేష్, అంకయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జనం పాలిట సంజీవనిలా..



డీవీ సత్రంలో సంజీవని బస్సు వద్ద కోవిడ్ పరీక్షలు చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

దొరవారిసత్రం: కోవిడ్ సమయంలో మహమ్మారి బారిన పడిన కుటుంబాల సభ్యుల పాలిట వలంటీర్లు సంజీవనిలా మారారు. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయడానికి సంజీవని బస్సును ఏర్పాటు చేయగా కోవిడ్ భారీన పడిన వారి కుటుంబ సభ్యులను వలంటీర్లు ధైర్యంగా ఆ బస్సు ఉన్న ప్రాంతానికి తరలించి, పరీక్షలు చేయించారు. అలాగే కోవిడ్ బాధితులకు మందులు, సలహాలు సూచనలు ఇచ్చారు. వారికి నిత్యావసర సరుకులు, కూరగాయలు, మందులు అందజేశారు.

మా ప్రాణాలు కాపాడారు



“ వలంటీర్లు ప్రజలకు ఎప్పటికప్పుడు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించి, ఆ వ్యాధి బారిన పడకుండా మా ప్రాణాలు కాపాడిన దేవుళ్లు. గ్రామాల్లో ఎవరికైనా కోవిడ్ సోకిందని తెలిసిన వెంటనే ఆప్రాంతానికి వలంటీర్లు వచ్చి, వారి బంధువులు, సన్నిహితులు, ఎవరి ఎవరితో మాట్లాడారనే విషాలయాలను ఆరా తీసి తగు జాగ్రత్తలు తీసుకుని నిర్ధారణ పరీక్షలు చేయించడంలో కీల పాత్ర పోషించారు.

– ఎం పురుషోత్తం, డీవీ సత్రం

సెమిస్టర్ -2 పాఠ్యపుస్తకాల పంపిణీ



కలువాయి: పుస్తకాలతో విద్యార్థులు, అధికారులు



కోట: పుస్తకాల అందజేస్తున్న సర్పంచ్ దేవారెడ్డి



వాకాడు: పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ అనిల్‌కుమార్‌రెడ్డి

కలువాయి: ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం కలువాయి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం ఒక్కరోజులోనే సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశామని ఎంఈఓలు ఎం.బాలకృష్ణారెడ్డి, జి.శేషగిరిరావు తెలిపారు. కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను విద్యార్థులు వినియోగించుకుని విద్యలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్బాస్, సీఆర్పీ మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు : మండలంలోని ముట్టెంబాకలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వీటిని సర్పంచ్ ఎన్ అనిల్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టీపీ రమణయ్య పాల్గొన్నారు.

కోటలో..

కోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను శనివారం సరఫరా చేశారు. ఎంఈఓ మస్తానయ్య పర్యవేక్షణలో 60 పాఠశాలలకు మొత్తం 15,200 పుస్తకాలను అందజేశారు. చెందోడులో సర్పంచ్ దేవారెడ్డి మాధవి, నాగూర్‌రెడ్డి, ఉపసర్పంచ్ జయచంద్రారెడ్డి చేతుల మీదుగా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

ఇంటింటి సర్వే పరిశీలన



సర్వేని పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ చంద్రముని

తడ: మండలంలోని నిర్వహిస్తున్న ఓటరు జాబితా ఇంటింటి సర్వేని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని శనివారం స్వయంగా పర్యవేక్షించారు. కారూరు, తడకండ్రిగ గ్రామాల్లో సర్వే జరుగుతున్న తీరును తహసీల్దార్ జయజయరావుతో కలిసి పరిశీలించి, ప్రజల నుంచి వివరాలు తెలుసుకునే సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను గురించి సిబ్బందికి వివరించారు.

అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం చింతవరం గ్రామానికి చెందిన కే చంద్రశేఖర్‌రావు, నిర్మల, సింధు వైష్ణవి దాతృత్వంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

గూడూరురూరల్: రెండు కిడ్నీలు చెడిపోవడంతో మంచంలో ఉన్న యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రాజనేని శ్రీనివాసులునాయుడు శనివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్‌కు చెందిన నాగిశెట్టి హరి(26) యువకుడికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. అతడి భార్య మనీషా రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసులునాయుడుకి ఫోన్‌ద్వారా తమ పరిస్థితిని వివరించింది. దీనిపై స్పందించిన ఆయన ట్రస్టు ప్రతినిధులు బాబు, భాస్కర్, ప్రజేంద్రరెడ్డి ద్వారా హరి కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

చరిత్ర సృష్టించారు!

దక్కిలి: వెంకటగిరిలో శుక్రవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలు కనివిని ఎరుగని రీతిలో తరలివచ్చి చరిత్ర సృష్టించారని ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ సీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం డక్కిలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు జీ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్ వేణునాయుడు, నాయకులు కే వేణు, ఎం లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కోటీశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.